# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :141 | ప్రచురణ : హైదరాబాద్ | శుక్రవారం,3-04-2026 | పేజీలు: 8 | వెల : 3- 00


## ఫ్యూచర్ సిటీ కార్యాలయం త్వరగా పూర్తి చేయండి..



ఫ్యూచర్ సిటీ కార్యాలయం, స్కిల్ యూనివర్సిటీ భవనాల నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని అధికారులను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఇవాళ ఫ్యూచర్ సిటీలో నిర్మాణాల పురోగతిని ఆయన పరిశీలించారు. ఫ్యూచర్ సిటీ కార్యాలయం, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కాగా రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్‌లో 20 ఎకరాల్లో రు.19 కోట్లతో భారత్ ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎఫ్‌సిడిఎ) కార్యాలయానికి గతేడాది సెప్టెంబర్?లో సీఎం రేవంత్ రెడ్డి పునాది రాయి వేశారు. అయితే కేరళం పర్యటన ముగించుకుని వచ్చిన ముఖ్యమంత్రి అనంతరం ఫ్యూచర్ సిటీ నిర్మాణాలను పరిశీలించారు.

## తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థులకు సుప్రీంకోర్టులో చుక్కెదురు..



హైదరాబాద్: ఇటీవల టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ఉద్యోగ నియామకాల్లో జోక్యం చేసుకునేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. ఈ మేరకు గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌ను జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం డిస్మిస్ చేసింది. గ్రూప్-1 పరీక్షల్లో అవకతవకలు జరిగాయంటూ పలువురు అభ్యర్థులు ఇంతకుముందు హైకోర్టును ఆశ్రయించారు. మూల్యాంకనంలో తప్పులున్నాయని, నోటిఫికేషన్ రద్దు చేసి.. మళ్లీ పరీక్షలు నిర్వహించాలని కోరారు.విచారణ చేపట్టిన హైకోర్టు డివిజన్ బెంచ్.. గ్రూప్-1 పరీక్షలో అక్రమాలు కనిపించలేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండానే హైకోర్టు తీర్పునిచ్చిందని కోర్టుకు వివరించారు. మూడుసార్లు మూల్యాంకనం జరిగిందని టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. అక్రమాలకు తావులేకుండా నియామక ప్రక్రియ చేపట్టినట్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇరువైపులా వాదనలు విన్న న్యాయస్థానం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

## కాళేశ్వరంపై రాజ్యసభలో కిషన్‌రెడ్డి, సురేశ్‌రెడ్డిల వాగ్వాదం



దిల్లీ: కాళేశ్వరం అంశంపై రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీ సురేశ్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ చేసిన వ్యాఖ్యలపై సురేశ్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అయితే, సురేశ్‌రెడ్డి వ్యాఖ్యలపై కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. మేడిగడ్డ పనికిరాకుండా పోవడానికి బీఆర్ఎస్ కారణమని, ఇదే విషయాన్ని నిపుణుల కమిటీ కూడా చెప్పిందన్నారు."కాళేశ్వరాన్ని కేసీఆర్ కుటుంబం ఓ ఏటీఎంలా వాడుకుంది. ఇంజినీర్లను కూడా అడగకుండా కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. రూ.లక్షకోట్ల ప్రజాధనాన్ని కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేశారు. కేసీఆర్‌ను జైల్లో పెడతానన్న సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటివరకు ఏం చేశారు. ఆనాడు 7 మండలాల విలీనానికి కేసీఆర్ ఒప్పుకున్నారు. విలీనం తర్వాత కూడా సోనియాగాంధీ ఇంటికి ఆయన వెళ్లారు" అని కిషన్‌రెడ్డి అన్నారు.

### తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి: సురేశ్‌రెడ్డి

కేసీఆర్ చేసిన పోరాటం వల్లే తెలంగాణ సాకారమైందని సురేశ్‌రెడ్డి అన్నారు. "ప్రాంతాలుగా వేరవుదాం.. అన్నదమ్ముల్లా కలిసుందామని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అనుమతి లేకుండానే కొన్ని మండలాలను ఏపీలో కలిపారు. ఏడు మండలాలను ఏపీలో విలీనం చేసేటప్పుడు చర్చ జరగలేదు. తల్లిని చంపి బిడ్డను బతికించారని మోదీ అనేక సార్లు అన్నారు. ఏపీ విభజన బిల్లును పునర్నిర్మాణ బిల్లుగా చేయొద్దు. 12 ఏళ్లుగా తెలంగాణకు కేంద్రం ఎలాంటి సహాయం చేయట్లేదు. కేంద్రం సహకరించకున్నా.. తెలంగాణ అభివృద్ధి చెందుతోంది. విభజన చట్టం ప్రకారం తెలంగాణకు కూడా హామీలు అమలు చేయాలి.

## తెలంగాణలో 2 లక్షల కొత్త పెన్షన్లు..

- చేయూత కింద 2 లక్షల కొత్త పెన్షన్లకు ప్రభుత్వం ఆమోదం
- బడ్జెట్‌లో రూ.233 కోట్లు కేటాయించిన రేవంత్ సర్కార్
- మూడేళ్లుగా పేరుకుపోయిన 12 లక్షలకు పైగా దరఖాస్తులు
- లబ్ధిదారుల ఎంపిక అధికారులకు అతిపెద్ద సవాల్



తెలంగాణలో కొత్త పెన్షన్ల కోసం ఏళ్లుగా ఎదురుచూస్తున్న లక్షలాది మందికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. చేయూత పథకం కింద కొత్తగా మరో 2 లక్షల మందికి పెన్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా 2026-27 వార్షిక బడ్జెట్‌లో రూ.233 కోట్లను కేటాయించడంతో, లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు రంగం సిద్ధమైంది. అయితే, ఇప్పటికే పేరుకుపోయిన లక్షలాది దరఖాస్తుల నుంచి అర్హులను గుర్తించడం అధికారులకు పెను సవాల్‌గా మారనుంది.ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వివిధ కేటగిరీలలో 42.23 లక్షల మంది నెలనెలా చేయూత పెన్షన్లు పొందుతున్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, చేనేత కార్మికులు, హెచ్ఐవీ, బోదకాలు బాధితులకు నెలకు రూ.2,016 చొప్పున ప్రభుత్వం అందిస్తోంది. దివ్యాంగులకు మాత్రం పెన్షన్‌ను రూ.4,016గా ఇస్తున్నారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో 2 లక్షల మంది కొత్తగా చేరనున్నారు. గత మూడేళ్లుగా బోదకాలు, డయాలసిస్ బాధితులకు తప్ప కొత్తగా ఎలాంటి పెన్షన్లు మంజూరు కాకపోవడంతో అర్హులైన వారు తీవ్ర నిరాశలో ఉన్నారు.ఈ నేపథ్యంలో, రాష్ట్రవ్యాప్తంగా సుమారు 12 లక్షలకు పైగా దరఖాస్తులు ప్రభుత్వానికి చేరి పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల బడ్జెట్‌లో కొత్త పెన్షన్ల ప్రకటన వెలువడిన తర్వాత, ఫిబ్రవరి 20 నుంచి ప్రజావాణి వంటి కార్యక్రమాల ద్వారా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీనికి తోడు, గురువారం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల్లో కూడా భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.ప్రభుత్వం ఆమోదించినవి 2 లక్షల పెన్షన్లు కాగా, ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 12 లక్షలు దాటింది. వీటిలో వృద్ధాప్య పింఛన్ కోసం 4 లక్షలు, వితంతు, ఒంటరి మహిళల కోటాలో 3.5 లక్షలు, గీత, చేనేత కార్మికుల విభాగంలో 3 లక్షలు, దివ్యాంగుల పింఛన్‌కు 72 వేల దరఖాస్తులు ఉన్నాయి. ఈ భారీ సంఖ్య నుంచి కేవలం 2 లక్షల మంది అత్యంత అర్హులను ఎంపిక చేసేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు త్వరలోనే పటిష్టమైన వడపోత కార్యక్రమం చేపట్టనున్నారు. ఈ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించడం ప్రభుత్వానికి కత్తిమీద సాములా మారింది.

## సమీకృత భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి



హైదరాబాద్: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేసి చూపిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పునరుద్ఘాటించారు. భూ క్రయవిక్రయాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు రూపొందించిన 'సమీకృత భూభారతి' పోర్టల్‌ను రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలం విఠాయిపల్లిలో ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉండే ప్రజాప్రభుత్వమిది అని అన్నారు. ఈ నెలాఖరులో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.

## నా పేరు చెప్పి కబ్జాలు, సెటిల్ మెంట్లు చేస్తే కంప్లైంట్ చేయండి



అక్రమార్కులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ వార్నింగ్ ఇచ్చారు. తన పేరు చెప్పి సెటిల్ మెంట్లు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గంలో తన పేరు వాడుకుని ఎవరైనా కబ్జాలు, అక్రమ దందాలకు పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయని కేంద్ర మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. పంచాయతీలు, సెటిల్ మెంట్ల పేరుతో ప్రజలను ఇబ్బంది పెడితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోనని ఆయన స్పష్టం చేశారు. ప్రజా ప్రతినిధులు సైతం పైరవీకారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బండి సంజయ్ సూచించారు. ప్రజలకు సేవ చేస్తూ పార్టీకి మంచి పేరు తెచ్చేవారిని ఎప్పుడూ ప్రోత్సహిస్తానని.. కానీ అక్రమాలకు పాల్పడితే మాత్రం కఠిన చర్యలు తప్పవని అన్నారు.ఎవరైనా తన పేరు చెప్పి వేధింపులకు గురిచేస్తే.. భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలను కోరారు. అలాగే, కరీంనగర్‌లోని తన ఎంపీ కార్యాలయ సిబ్బంది దృష్టికి కూడా ఈ విషయాలను తీసుకురావాలని బండి సంజయ్ విజ్ఞప్తి చేశారు.

# నూతన బస్టాండ్ల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తా : కూనంనేని

- మహిళా సాధికారతకు చేదోడుగా 'ఉచిత బస్సు' సౌకర్యం
- పేద కుటుంబాల ఉపాధికి ఊతమిచ్చిన ఉచిత ప్రయాణం
- ఆర్థిక స్వావలంబన దిశగా మహిళల అడుగులు
- శ్రమశక్తికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం
- ప్రతిరోజూ 35 లక్షల మంది మహిళలకు లబ్ధి
- రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్లకు చేరిన జీరో ఛార్జీ టిక్కెట్లు
- ఉచిత ప్రయాణంతో మహిళలకు రూ. 10,000 కోట్ల ఆదా
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు




**కొత్తగూడెం (న్యూస్ ఇండియా ప్రతినిధి) ఏప్రిల్ 2:** మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ ఆరుగ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో, గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో '99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడాతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా గొప్ప అడుగు అని, నిత్యం కష్టపడే శ్రమశక్తికి ఇది వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు తమ పనుల నిమిత్తం ప్రయాణించేటప్పుడు ఛార్జీల భారం తగ్గి, ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని, నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది పెద్ద ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్ల జీరో ఛార్జీ టిక్కెట్లు నమోదయ్యాయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ. 10,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు మార్కెటింగ్, ఇతర ఉపాధి పనులకు వెళ్లేందుకు ఇది ఒక వరమని ఆయన పేర్కొన్నారు.

ప్రజాపాలనలో భాగంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. నూతన బస్టాండ్ల కోసం ప్రతిపాదన పెట్టిన స్పందన లేదని, బస్టాండ్ ల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని అన్నారు.

ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకొని లబ్ధిపొందిన పలువురు మహిళలను ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్యలక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై నాగేశ్వర్ రావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ కలెక్టర్ భవన్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి



**న్యూస్ ఇండియా హనుమకొండ జిల్లా ప్రతినిధి** ముఖ్యఅతిథిగా విచ్చేసిన వరంగల్ కలెక్టర్ అడిషనల్ కలెక్టర్ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బోనాగాని యాదగిరి గౌడ్ మరియు చిర్ర రాజు గౌడ్ పస్తం అనిల్ దీ=ూ పార్టీ దీ=ూఎ జిల్లా సీనియర్ నాయకులు54 డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు వెంకటేశ్వర్లు గౌడ్ శ్రీనివాస్ యాదవ్ పవన్ కర్ణాకర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సర్దార్ మంగా మాట్లాడుతూ సర్వాయి పాపన్న మౌలాలి రాజ్యాన్ని కొలగొట్టి 12,000 మంది సామరాజ్యంతో మౌలాలిలా కోటను బద్దలు కొట్టి మన యొక్క భారతదేశ ఆత్మగౌరాన్ని నిలిపే విధంగా గోల్కొండ కోట మీద మౌలాలి యొక్క రాజు తలను కోసి వేలాడదీసిన మహారాజు సర్వాయి పాపన్న గౌడ్ గారు మీరు అనేక పోరాటాలకు స్ఫూర్తిగా నిలుస్తూ ఈ రోజుల్లో ఈ గవర్నమెంట్ ఏదైనా కూడా సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో ముందుకు సాగుతూ ఉంది సర్వాయి పాపన్న చేసిన అనేకమైన పోరాటాలు ఇప్పుడు మన సమాజానికి చాలా స్ఫూర్తిగా పనిచేస్తున్నాయి ఇలాంటి సర్వాయి పాపన్న గౌడ్ వారు అన్యాయాన్ని ప్రశ్నించే వ్యక్తిగా ఉండేవాడు మనం కూడా సర్వాయి పాపన్న లాంటి కలిగి ఉన్న ప్రతి వ్యక్తి కూడా అన్యాయాన్ని ప్రశ్నించి ప్రజా పోరాటంలో ప్రజలందరికీ మంచి జరిగే లాగా చూడాలని మనలో శ్రేయస్సు మంచి కోరుకునే లాగా ఉండాలని ఛత్రపతి శివాజీ కంటే ముందు సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి చాలా బాగుండేదని ఇక స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రెవెన్యూ పోలీస్ సివిల్ మున్సిపాలిటీ వివిధ ఆఫీసర్స్ మరియు అధికారపక్ష ప్రతిపక్ష నాయకులు కర్ణాకర్ చరణ్ మల్లారెడ్డి కుమార్ చందు శ్రావణి మౌనిక సౌమ్య కిరణ్ మల్లారెడ్డి శరత్ వినోద్ కర్ణ రామ్ చరణ్ శ్రావణి రమ వివిధ నాయకులు పాల్గొనడం జరిగినది

# కొనాయిమాకుల గ్రామ సభలో పాల్గొన్న కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి



**వరంగల్ సిటీ బ్యూరో. న్యూస్ ఇండియా ప్రతినిధి. (రవీందర్)** ప్రజల సమస్యల పరిష్కారం, గ్రామాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల యాక్షన్ ప్లాన్ లో భాగంగా నేడు గీసుగొండ మండలంలోని కొనాయిమాకుల గ్రామపంచాయతీలో గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ కుడా ఛైర్మన్, హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి అధికారికంగా హాజరయ్యారు.

సభకు విచ్చేసిన ముఖ్య అతిథి ఇనగాల వెంకట్ రామ్ రెడ్డి వారికి గ్రామ సర్పంచ్, పీసల , రాజు , గీసుకొండ ఎమ్మార్వో మరియు ఆర్డీవో పూల బొకేలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అధికారులతో కలిసి కొనైమాకుల గ్రామసభలో పాల్గొన్నారుఈ సందర్భంగా గ్రామ ప్రజలను ఉద్దేశించి ఇనగాల వెంకట్రామ్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వంలో ప్రతి పౌరుడికి న్యాయం జరగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ 99 రోజుల ప్రగతి ప్రణాళికను రూపొందించారని తెలిపారు. ప్రజా పాలనలో ప్రజల బాగస్వామ్యం పెంచి,ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సిలిండర్,సన్నరకం. బియ్యం వ్యవసాయ రైతుల ధాన్యం కొనుగోలు. 500 బోనస్, చేయుట పెన్షన్లు, గృహ జ్యోతి, కళ్యాణ లక్ష్మీ మరియు వివిధ పథకాల పై చర్చించి,లబ్దిదారుల నుండి అభిప్రాయాలను సేకరించారు.ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన కొత్త పథకాలైన ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకం, ఇంటర్మీడియెట్ వరకు అల్పాహార పథకం, దివ్యాంగులైన ఇంటర్మీడియెట్ విద్యార్థులకు రెట్రో ఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీ ల గురించి, గ్రామానికి కావాల్సిన అవసరాలు, సమస్యలను మరియు పరిష్కార మీద చర్చించి రిజిస్టర్ లో నమోదు చేశారు.

ఈ ప్రణాళికలో భాగంగా గ్రామానికి వర్తించే పలు కీలక అంశాలను ఆయన ప్రజలకు వివరించారు

పారిశుద్ధ్యం – పరిసరాల పరిశుభ్రత: గ్రామంలో చెత్త తొలగింపు, మురుగు కాలువల శుభ్రతకు మొదటి ప్రాధాన్యత.

ప్రభుత్వ పథకాల లబ్ధి: ఇందిరమ్మ ఇళ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ?500 లకే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడటం.

విద్య, వైద్య రంగాల బలోపేతం: స్థానిక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి మరియు పల్లె దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలు అందించడం.

రైతు సంక్షేమం: రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల లభ్యత మరియు వ్యవసాయ సంబంధిత సమస్యల తక్షణ పరిష్కారం.

యువతకు ఉపాధి: గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు స్కిల్ ట్రైనింగ్ మరియు ఉపాధి అవకాశాలు కల్పించడం.

యాంటీ డ్రగ్స్ ప్రచారం: గ్రామీణ యువత పెడదోవ పట్టకుండా డ్రగ్స్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన.

ప్రభుత్వం చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమంలో గ్రామ ప్రజలంతా భాగస్వాములై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రజా సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామసభ సభ్యులైన ఉప సర్పంచి, వార్డు సభ్యులు, కృష్ణా పంచాయతీ కార్యదర్శి, శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, రైతులు, ూ౨+ సభ్యులు, పథకాల లబ్ధిదారులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వల్మీడీ గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు...

వల్మీడి గ్రామం అంతా కాషాయపు జెండాలా తో యూవత బైక్ ర్యాలీ...




**పాలకుర్తి ఏప్రిల్ 02 (న్యూస్ ఇండియా ప్రతినిధి )** జనగామ జిల్లా పాలకుర్తి మండల్ వల్మీడీ గ్రామంలో హనుమాన్ జయంతి వేడుకలు. ఈ వేడుకలలో గ్రామానికి చెందిన యువత మరియు గ్రామపంచాయతీ పెద్దలు పది రోజులు పాల్గొన్నారు.

# టేకులకుంట తండా కార్యదర్శి కి సన్మానం..



**న్యూస్ ఇండియా :నెక్కొండ** టేకుల కుంట తండా గ్రామ పంచాయతీలో ప్రజా–పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్,సర్పంచ్ విజయ ఆధ్వర్యం లో అతిథులుగా ఏఈఓ రాజేష్ సమక్షంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధి ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ ప్రజలకు అందుతున్న సంక్షేమ కార్యక్రమాల పై చర్చించారు.గ్రామంలో ప్రజా సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.అనంతరం నూతనంగా ఎన్నికైన టేకులకుంట తండా కార్యదర్శి రమేష్ కి సర్పంచ్ విజయ,ఉపసర్పంచ్ లత,వార్డ్ మెంబర్ భూక్యా మమత లకు ఉపాధ్యాయులు యాకుబ్ సన్మానం చేయడం జరిగింది.గ్రామ అభివృద్ధికి ప్రజలు మరియు అధికారులు కలిసి పనిచేయాలని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ ప్రజలు కూడా కార్యక్రమంలో పాల్గొని తమ సమస్యలను తెలియజేశారు.

# చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను సందర్శించిన ఎస్పీ

సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ ఉండాలి




**భద్రాద్రి కొత్తగూడెం (న్యూస్ ఇండియా ప్రతినిధి) ఏప్రిల్ 2 :**జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం అక్కడ ఉన్న పోలీస్ అధికారులు,సిబ్బందికి పలు సూచనలు చేశారు.పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని,వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు.అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పలు కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలిపారు.పోలీస్ స్టేషన్లో పనిచేసే అధికారులు సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు.అనంతరం చుంచుపల్లి పోలీస్ స్టేషన్ పైన ఉన్న డిస్ట్రిక్ట్ సైబర్ క్రైమ్స్ కో–ఆర్డినేషన్ సెంటర్ ను సందర్శించారు.ఇప్పటివరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో నమోదైన సైబర్ నేరాల వివరాలను అట్టి కేసుల పురోగతిని గురించి అడిగి తెలుసుకున్నారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లాలోని పోలీసు అధికారులతో ఎప్పటికప్పుడు సమన్వయం పాటిస్తూ అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్ అధికారులకు సూచించారు.కంటికి కనపడకుండా ఆన్లైన్ ద్వారా సైబర్ నేరగాళ్లు చేస్తున్న మోసాలను ఎప్పటికప్పుడు ప్రజలకు వివరించేలా కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.సైబర్ నేరాల బారిన పడకుండా జిల్లా ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్త చేస్తూ విస్తృతస్థాయిలో ప్రచారం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,సైబర్ క్రైమ్స్ డిఎస్పీ అశోక్,సీఐ జితేందర్,చుంచుపల్లి ఎస్సైలు రవి,ఉమ మరియు ఎస్సై జుబేదా,సిబ్బంది పాల్గొన్నారు.

# శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు

కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం




**కరీంనగర్, న్యూస్ ఇండియాఏప్రిల్ 02:** కమీషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఏసీపీ ల నుంచి అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు. అనుమతులు లేకుండా ఎటువంటి సభలు సమావేశాలు,ర్యాలీలు నిర్వహించకూడదని సంబంధిత అధికారుల నుండి అనుమతులు తప్పనిసరి అని తెలిపారు అనుమతుల కోసం దరఖాస్తు చేయడం ద్వారా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అట్టి కార్యక్రమానికి తగిన విధంగా పోలీసు శాఖ భద్రతాపరమైన చర్యలు చేపడుతుంది అన్నారు.

ఈ చట్టం అమలులో ఉండగా ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదు.జన సంచారం మరియు అనుమతి పత్రాలలో పేర్కొన్నబడిన ప్రాంతాలలో మ్యూజిక్ లు, పాటలు, ప్రసంగాలు, రణగొణ ధ్వనులు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు ఈనెల 30 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ తెలిపారు.

# అత్యవసరం అయితేనే బయటకు రావాలి డాక్టర్ హనుమంతరావు



**న్యూస్ ఇండియా పెన్ పవర్ ఏప్రిల్ 02:** వేసవి కాలం భానుడి భగభగలతో రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో స్థానిక ప్రజలు పలు జాగ్రత్తలు పాటించాలని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనుమంతరావు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూఎండ తీవ్రత పెరుగుతున్నందున ప్రజలు అనవసరంగా బయటకు వెళ్లకూడదని సూచించారు . అత్యవసర పరిస్థితులలో బయటకు వెళ్ళాల్సి వస్తే తెల్లని కాటన్ దుస్తులను ధరించి, తల మీద క్యాప్ పెట్టుకోవాలని, తప్పనిసరిగా గొడుగు వాడాలన్నారు, ఎక్కువగా మంచి నీళ్లను, పండ్ల రసాలు , ఉప్పు కలిపిన మజ్జిగ, ఓ ఆర్ ఎస్ వంటి పనియాలను సేవించాలన్నారు,

వడదెబ్బకు గురైన వెంటనే చల్లని ప్రదేశాలకు తరలించి, తడి గుడ్డతో శరీరాన్ని తుడిచి, చల్లటి ఫ్యాన్ గాలికి ఉంచాలని.

ఆరోగ్య పరిస్తితి విషమిస్తే వెంటనే అందుబాటులో ఉండే పి హెచ్ సి లేదా సివిల్ ఆసుపత్రికి తరలించి చికిత్స పొందాలన్నారు.ఏదైనా అత్యవసర వైద్య సహాయం కొరకు 108 ని సంప్రదించాలని ఆయన కొరారు.

# బహుజన ధీరత్వానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్: ఎమ్మెల్యే మేఘారెడ్డి

గౌడల కోసం ఎకరా స్థలంలో సామూహిక భవనం నిర్మాణం



**న్యూస్ ఇండియాప్రతినిధి, వనపర్తి జిల్లా:** బహుజన ధీరత్వానికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గెరిల్లా యుద్ధ విధానంతో గోల్కొండ కోటపై జెండా ఎగరవేసి, బహుజనుల అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు.సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, మొఘల్ పాలకులు మరియు జమీందారుల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన పాపన్న గౌడ్ పేదలు, బహుజనుల రక్షకుడిగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయాలను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.వనపర్తి జిల్లా కేంద్రంలో గౌడ సోదరుల సౌకర్యార్థం ఒక ఎకరా స్థలంలో సామూహిక భవనం నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా అదనపు కలెక్టర్

# రేషన్ షాపు ను ఏర్పాటు చేయాలి



**గార్ల, న్యూస్ ఇండియా ఏప్రిల్ 02:** గార్ల మండల కేంద్రంలోని స్థానిక పినిరెడ్డిగూడెం పంచాయతీ లో నూతన రేషన్ షాపును ఏర్పాటు చేయాలని సిపిఎం మండల నాయకులు వంగూరి వెంకటేశ్వర్లు, చింత ఎల్లయ్య, గ్రామశాఖ కార్యదర్శి వంగూరి కొండయ్యలు డిమాండ్ చేశారు.పినిరెడ్డిగూడెం గ్రామం లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రజాపాలన గ్రామసభలో సర్పంచ్ కేలోత్ వీరన్న,అధికారులు జి. లలిత, రాజ్యలక్ష్మి లకు వినతిపత్రం అందించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్మశాన వాటికలోను, పోచారం క్రాస్ రోడ్డు నుండి గ్రామం వరకు స్తంబాలు వేసి,వీధి లైట్లు ఏర్పాటు చేయాలని,వేసవిలో మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామంలో అవసరమైన చోట సీసీ రోడ్లు,డ్రైనేజీ లు, విద్యుత్ స్తంభలు నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు,వృద్ధులు,చిన్నపిల్లలకు తీవ్ర సమస్యగా ఉంటున్న కోతులు, వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలు పార్టీలకు అతీతంగా అందించాలని డిమాండ్ చేశారు.స్థానిక హెల్త్ సెంటర్లో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమీంచి వైద్యం సేవలు అందించాలని కోరారు. గ్రామంలో ప్రధాన సెంటర్ లో ఉన్న సెంట్రల్ లైటింగ్ సిస్టం మరమ్మత్తులకు గురి కావడంతో ప్రధాన సెంటర్ లో చీకట్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి లలిత స్మశాన వాటికలో లైటింగ్ ఏర్పాటు చేసేంధుకు తీర్మానం చేశారు. ఈ కార్యక్రమం లో నాయకులు, గ్రామస్తులు యం. కొండయ్య,డి. రమేష్,బిఆర్ ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు బి. లక్ష్మారెడ్డి,ఉప సర్పంచ్ బి. కొండల్ రావు,మంగీలాల్,సాయిలు,దుర్గయ్య, తదితరులు ఉన్నారు

# ఏన్కూర్‌లో బ్యాంకులకు టోకరా

గోల్డ్ అప్రైజర్‌తో కుమ్మక్కై భారీ మోసం...నలుగురు అరెస్ట్

రూ. 9.53 లక్షల బ్యాంకు రుణం కాజేసిన ముఠా

బ్యాంకు వేలంలో బయటపడిన నకిలీ బంగారం







**న్యూస్ ఇండియా ప్రతినిధి ఇస్లావత్ నరసింహ ఏన్కూరు ఏప్రిల్ 02 2026:** కల్లూరు డివిజన్ పరిధిలోని ఏన్కూర్ పోలీస్ స్టేషన్ హద్దుల్లో నకిలీ బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి బ్యాంకు రుణాలు పొందిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ విషయాన్ని కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ తెలిపారు.

తెలంగాణ గ్రామీణ బ్యాంకు, ఏన్కూర్ శాఖ నిర్వాహకుడు కె.వి. ప్రశాంత్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా 2024 సంవత్సరంలో బంగారు ఆభరణాల విలువ నిర్ధారించే అధికారి (గోల్డ్ అప్రైజర్) శ్రీపాది సతీష్, శ్రీపాది మౌనిక, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజు నరేష్‌లు కలిసి సుమారు 242.25 గ్రాముల నకిలీ బంగారు ఆభరణాలను అసలైనవిగా చూపించి రూ. 9,53,000 విలువైన రుణాలను పొందినట్లు పోలీసులు గుర్తించారు.

తీసుకున్న రుణాలను తిరిగి చెల్లించకపోవడంతో సంబంధిత ఖాతాలు నిరర్థక ఆస్తులుగా (ఎన్పీఏ) మారాయి. అనంతరం బ్యాంకు అధికారులు వేలం ప్రక్రియ చేపట్టగా తాకట్టు పెట్టిన ఆభరణాలు నకిలీవని బయటపడింది. దీంతో బ్యాంకు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈ కేసులో నిందితులైన శ్రీపాది సతీష్, రామచంద్రోజు జయమ్మ, రామచంద్రోజు నరేష్‌లను పోలీసులు అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. మరో నిందితురాలు శ్రీపాది మౌనిక పరారీలో ఉన్నట్లు సమాచారం.

ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఏసీపీ వసుంధర యాదవ్ హెచ్చరించారు. ప్రజలు బ్యాంకింగ్ లావాదేవీల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


# ప్రభుత్వ పథకాలును సద్వినియోగం చేసుకోండి



**న్యూస్ ఇండియా చింతకాని ప్రతినిధి.** ప్రభుత్వ పథకాలును సద్వినియోగం చేసుకోండి అనినాగులవంచ సర్పంచ్ నారగానిరాంబాయి,మత్కేపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంబటివెంకటేశ్వరరావు అన్నారు.నాగులవంచ గ్రామ రైతు వేదికలో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పై గ్రామ సభ నిర్వహించడం జరిగింది. సభనుఉద్దేశించి ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించిరెండుసంవత్సరాల్లో మూడు నెలలు పూర్తయింది. ఆర్థిక సవాళ్లు అధిగమిస్తూ గత పాలకులు తప్పిదాలను సరిచేస్తూ సంక్షేమ అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా మన ప్రభుత్వం పని చేస్తుంది. మేము పాలు కులం కాదు సేవకులం అనే నినాదంతో మహాలక్ష్మి పథకం. ఉచిత బస్సు సౌకర్యం. 500 కే గ్యాస్ సిలిండర్,200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత, ఆరోగ్యశ్రీ. రేషన్ కార్డులు, సన్న బియ్యం, ఇందిరమ్మ ఇల్లు, మహిళా సాధికారత వంటి పథకాలు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం,ప్రజా ప్రభుత్వం సేవా భావంతో పనిచేస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ బుద్దే చిరంజీవి, ఉప సర్పంచ్ అంబటి శరత్, మాజీ సర్పంచ్ కంభం వీరభద్రం,గ్రామ వార్డు మెంబర్లు,గ్రామ పెద్దలు ఆలస్యం బసవయ్య, నారగాని శ్రీనివాసరావు, అంబటి శాంతయ్య,ఆలస్యం రవి, వంకాయలపాటి లచ్చయ్య,తోటకూరి వెంకటనరసయ్య,కోలేటి నాగేశ్వరరావు,గార్లపాటి కాంతారావు,కోలేటి పెద్ద బ్రహ్మయ్య, పడిశాల ఆనందరావు,ఆలస్యం శ్రీను, అబాల వెంకన్న, కదిమళ్ళ రామారావు,ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య అధికారి వేణు, సూపర్వేజర్ కృష్ణరావు, సొసైటీ సీఈవో శ్రీనివాసరావు, హాస్టల్ వార్డెన్ వెంకటేశ్వరరావు,అంగన్వాడీ టీచర్స్,ఐకెపి సభ్యులు ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు,వివిధ రాజకీయ పార్టీనాయకులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# శ్రీ. సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ వర్ధంతి వేడుకలు

**ముఖ్య అతిథులుగా పాల్గొన్న అదనపు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్**



**న్యూస్ ఇండియా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 02,** గురువారం నాడు శ్రీ సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ వర్ధంతిని పురస్కరించుకొని అదనపు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ ఆద్వర్యంలో జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్ ఐ.డి.ఒ.సి. భద్రాద్రి కొత్తగూడెం నందు ఉ॥11:00 ని॥లకు కార్యక్రమము ఏర్పాటు చేసినారు. శ్రీ. సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ చిత్రపటమునకు పూల మాలను వేసి కార్యక్రమమును ప్రారంభించినారు, తదుపరి శ్రీ సర్దార్ సర్వాయిపాపన్న గౌడ్ జీవిత చరిత్ర మన పిల్లల, భావితరాల వారికి తెలియజేయాలని కులవృత్తిని ప్రోత్సహకరంగా సాగే సూచనలు చేయడం జరిగినది. ప్రభుత్వం అందించే.ఫలాలను గ్రామ స్థాయి వరకు సమాచారం అందించాలని తెలియజేసినారు. ఈ కార్యాక్రమంలో బండి రాజుగౌడ్ ,బుర్ర ధన్రాజ్ కమ్మగారని శంకర్ గౌడ్ ,పాసినివెంకన్నగౌడ్ ,బొమ్మగాని రమేష్ గౌడ్ ,లక్ష్మీనారాయణ గౌడ్ ,సరేష్ గౌడ్ ,శ్రీమతి పి. విజయలక్ష్మి, కన్వీనర్ /జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి, కార్యాలయ సిబ్బంది కార్యాక్రమంలో పాల్గొన్నారు. తదుపరి పలువురు బి.సి. నాయకులు ప్రసంగించినారు,

# మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం

- **పేద కుటుంబాల ఉపాధికి ఊతమిచ్చిన ఉచిత ప్రయాణం**
- **ఆర్థిక స్వాలంబన దిశగా మహిళల అడుగులు**
- **శ్రమశక్తికి వెన్నుదన్నుగా నిలుస్తున్న ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం**
- **ప్రతిరోజూ 35 లక్షల మంది మహిళలకు లబ్ధి**
- **రాష్ట్రవ్యాప్తంగా 290 కోట్లకు చేరిన జీరో ఛార్జీ టికెట్లు**
- **ఉచిత ప్రయాణంతో మహిళలకు రూ. 10,000 కోట్ల ఆదా**
- **కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు**




**న్యూస్ ఇండియాభద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 02**మహిళా సాధికారతకు చేదోడుగా ఉచిత బస్సు సౌకర్యం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ పథకం పేద కుటుంబాల ఆర్థికాభివృద్ధికి బాటలు వేసిందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల హామీ ఆరుగ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిన నేపథ్యంలో, గురువారం కొత్తగూడెం ఆర్టీసీ బస్టాండు ఆవరణలో '99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక' సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం మహిళల ఆర్థిక స్వాలంబన దిశగా గొప్ప అడుగు అని, నిత్యం కష్టపడే శ్రమశక్తికి ఇది వెన్నుదన్నుగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ఈ సౌకర్యం వల్ల మహిళలు తమ పనుల నిమిత్తం ప్రయాణించేటప్పుడు ఛార్జీల భారం తగ్గి, ఆ మొత్తాన్ని కుటుంబ అవసరాలకు వినియోగించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు కూడా ఈ పథకం ఎంతగానో దోహదపడుతుందని, నిత్యం విధులకు వెళ్లే వారికి ఇది పెద్ద ఊరటనిస్తోందని ఆయన పేర్కొన్నారు. ప్రతి రోజూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మహిళలు ఈ ఉచిత బస్సు సౌకర్యాన్ని వినియోగించుకుంటున్నారని వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 290 కోట్ల జీరో ఛార్జీ టిక్కెట్లు నమోదయ్యాయని, దీనివల్ల మహిళలకు సుమారు రూ. 10,000 కోట్ల మేర ప్రయాణ ఖర్చులు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ పథకం మహిళల్లో ఆత్మవిశ్వాసాన్ని నింపిందని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంత మహిళలకు మార్కెటింగ్, ఇతర ఉపాధి పనులకు వెళ్లేందుకు ఇది ఒక వరమని ఆయన పేర్కొన్నారు. ప్రజాపాలనలో భాగంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం మరింత కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఉచిత ప్రయాణాన్ని వినియోగించుకొని లబ్ధిపొందిన పలువురు మహిళలను ఎమ్మెల్యే శాలువాలు, పూలమాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర నాయకులు కందుల భాస్కర్, వంగ వెంకట్, డిపో మేనేజర్ రాజ్య లక్ష్మి, డిప్యూటీ సూపరింటెండెంట్ విజయలక్ష్మి, సిబ్బంది వై నాగేశ్వర్ రావు, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన శిక్షణ తరగతులను వాయిదా వేయాలి


**కలెక్టర్ ప్రతిమా సింగ్ కు తపస్ వినతి పత్రం**



**ఏప్రిల్ 02 న్యూస్ ఇండియా చేగుంట** :పదో తరగతి పరీక్షలు కొనసాగుతుండడం, 10వ తరగతి పరీక్షల మూల్యాంకనం లో ఉపాధ్యాయ సిబ్బంది ఉండటం, ఈ నెల 10 నుంచి 18 వరకు ఎస్ఏ 2 పరీక్షలు ఉండడం, ఇదే నెలలో తెలంగాణ ఓపెన్ టెన్త్ పరీక్షలు ప్రారంభం అవడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని జనగణనకు సంబంధించి విధులు నిర్వహించే ఉపాధ్యాయులకు
ఏప్రిల్ 23 తర్వాత ట్రైనింగ్ ఇవ్వవలసిందిగా కోరుతూ మెదక్ జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రతిమా సింగ్ కు, తపస్ మెదక్ జిల్లా పక్షాన ప్రాతినిధ్యం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో తపస్ మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాల సిద్ధు,జిల్లా కోశాధికారి మంగ నర్సింలు, జిల్లా ఉపాధ్యక్షులు గడిల మాధవరెడ్డి,ర్యావ శ్రీధర్ రెడ్డి, హవెలి ఘనపూర్ మండల అధ్యక్షులు తుందెన బిక్షపతి, చేగుంట మండల అధ్యక్షులు రావుల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

# యువత సమస్యలపై నిరంతర పోరాటం ఏఐ వైఎఫ్



**న్యూస్ ఇండియా చింతకాని ప్రతినిధి.** ఖమ్మం జిల్లా చింత ˇకాని మండలం కోడుమూరు గ్రామంలో అఖిలభారత యువజన సమాఖ్య ాాఅఎట గ్రామ శాఖ మహాసభ ాాఅఎట మండల నాయకులు బోళ్ల భాను అధ్యక్షతన యువజన సంఘం జిల్లా మాజీ నాయకులు కూచిపూడి రవి ఇంటిదగ్గర జరిగింది,ాాఅఎట యువజన సమాఖ్య జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బూరి మహేష్ మాట్లాడుతూ భవిష్యత్తులో యువత సమస్యలపై బలమైన పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు, యువకులు బెట్టింగ్ యాప్ల పట్ల దూరంగా ఉండాలని కోరారు, ఈ యాప్ల వల్ల జీవితాలు పోతున్నాయని, కుటుంబాలు చిన్నాభిన్న అవుతున్నాయని అన్నారు, ఈ కార్యక్రమంలో జిల్లా యువజన సమాఖ్య సహాయ కార్యదర్శి చింతల రమేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి మద్దోజు శ్రావణ్, కోశాధికారి కొల్లి రవి, మాజీ యువజన నాయకులు నీరుడు గోవిందరావు, నక్కనబోయిన కృష్ణ, నారపోగు నాగార్జును, తదితరులు పాల్గొన్నారు... గ్రామ యువజన సమాఖ్య అధ్యక్షులుగా గాడుదుల అనిల్, కార్యదర్శిగా కూచిపూడి సందీప్, 9 మంది కమిటీ సభ్యులు నూకల సాయి, కోటగిరి సైదారావు, నక్కన బోయిన ప్రవీణ్, రాజేష్, కాంపల్లి నవీన్, నారపోగు అశోక్, చిట్టి మోదు నవీన్, పవన్ చారి, రేగళ్ల రామ కృష్ణ ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగింది

# ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక-గ్రామసభ



**న్యూస్ ఇండియా చింతకాని ప్రతినిధి.** జగనాధపురం గ్రామంలో రైతు వేదిక నందు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక గ్రామసభ లో నిర్వహించడం జరిగినది.గ్రామ సర్పంచ్ తాళ్లూరి స్వప్న సభను ఉద్దేశించి: ప్రజా ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించి రెండు సంవత్సరాల్లో మూడు నెలలు పూర్తయింది. ఆర్థిక సవాళ్లు అధిగమిస్తూ గత పాలకులు తప్పిదాలను సరిచేస్తూ... సంక్షేమ అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా మన ప్రభుత్వం పని చేస్తుంది. మేము పాలు కులం కాదు సేవకులం అనే నినాదంతో..
మన ప్రజా ప్రభుత్వం:-మహాలక్ష్మి పథకం. ఉచిత బస్సు సౌకర్యం. 500 కే గ్యాస్ సిలిండర్. 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్. ఆరోగ్యశ్రీ. రేషన్ కార్డులు. సన్న బియ్యం. ఇందిరమ్మ ఇల్లు. మహిళా సాధికారత వంటి పథకాలు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం. ప్రజా ప్రభుత్వం సేవా భావంతో పనిచేస్తుంది అని అన్నారు.ఈ కార్యక్రమానికి. మత్కేపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బందెల నాగార్జున. ఉప సర్పంచ్ శ్రీదేవి. సొసైటీ సీఈవో శ్రీనివాసరావు. స్పెషల్ ఆఫీసర్. ఏఈఓ కార్తీక్. హెడ్మాస్టర్ వెంకటేశ్వర్లు. ఖఅఎ రజిని. కార్యదర్శి కృష్ణమాచారి. ఆశ వర్కర్. గ్రామ దీపిక. ఫీల్డ్ అసిస్టెంట్. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతంలోనే అత్యాధునిక వైద్యం....

**టేకులపల్లి రిమ్స్ హాస్పిటల్ లో ఓకే రోజు మూడు ఆపరేషన్లు విజయవంతం...**



**న్యూస్ ఇండియాభద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 02,** టేకులపల్లి మండల కేంద్రంలో స్థానిక రిమ్స్ హాస్పిటల్లో ఒకే రోజు మూడు కీలక శస్త్రచికిత్సలు గురువారం విజయవంతంగా చేశారు. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఈ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య పరికరాల సహాయంతో వైద్యులు కష్టమైన ఆపరేషన్లను కూడా చేస్తున్నట్లు టేకులపల్లి రిమ్స్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు. ఆపరేషన్లు హిస్టరెక్టమీ (గర్భ సంచి తొలగింపు), లిపోమా (కణితి గడ్డలు తొలగింపు), అపెండిక్స్ (24 గంటల తీవ్రమైన నొప్పితో అత్యవసర శస్త్రచికిత్స), ఈ మూడు శస్త్రచికిత్సలను ఎంఎస్ సర్జన్స్ బృందం నిపుణులైన గైనకాలజీ, జనరల్ సర్జన్ అనస్తీషియా వైద్యులు సమన్వయంతో నిర్వహించినట్లు రిమ్స్ హాస్పిటల్ డాక్టర్ నరేష్ తెలిపారు. శస్త్రచికిత్సలు పూర్తయ్యాక, పేషెంట్ల ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ నరేష్ పర్యవేక్షణలో ప్రత్యేకంగా చూసుకుంటున్నారని, ప్రస్తుతం వారి ఆరోగ్యం స్థిరంగా ఉందని తెలిపారు.ఆదివాసి గిరిజన ప్రాంతమైన టేకులపల్లిలో ఇలాంటి ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉండటం ప్రజలకు ఎంతో ఊరటనిస్తోందని, స్థానికులు వైద్యుల సేవలను ప్రశంసిస్తూ, ఆసుపత్రి నిర్వహణపై కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రజా సేవలకు నూతన దిశ... భరోసా కేంద్రం ప్రభుత్వ భవనానికి తరలింపు: జిల్లా ఎస్పీ




**న్యూస్ ఇండియా ప్రతినిధి -- వనపర్తి జిల్లా** వనపర్తి, మార్చి--02: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అద్దె భవనంలో కొనసాగుతున్న భరోసా కేంద్రాన్ని ప్రభుత్వ భవనానికి తరలించే ప్రక్రియ వేగవంతమైంది. ఈ క్రమంలో డీఎస్పీ కార్యాలయం సమీపంలోని ఎస్సై పాత నివాస భవనంలో చేపడుతున్న మరమ్మత్తు పనులను జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, ఐపీఎస్ స్వయంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రభుత్వ కార్యాలయాలు తప్పనిసరిగా ప్రభుత్వ భవనాల్లోనే నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టం చేసిన నేపథ్యంలో, భరోసా కేంద్రాన్ని అన్ని సౌకర్యాలతో కొత్త భవనానికి మార్చుతున్నామని తెలిపారు. సిబ్బందికి అనుకూల వాతావరణం, అవసరమైన సదుపాయాలు కల్పించడంతో పాటు ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు.మరమ్మత్తు పనులను త్వరితగతిన పూర్తి చేసి, భరోసా కేంద్రాన్ని త్వరలోనే కొత్త భవనంలో ప్రారంభించాలని సంబంధిత అధికారులకు ఎస్పీ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వరరావు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ, భరోసా ఎస్సై అంజద్, వనపర్తి పట్టణ 2వ ఎస్సై శశిధర్, భరోసా కోఆర్డినేటర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ ఇండియా
నిజం మా ఇజం

# ఎడిటోరియల్

## అగ్రరాజ్యానికి ఆయుధమే ఆహారం..

ప్రపంచపటంలో తననుతాను 'ప్రజాస్వామ్య రక్షకురాలు'గా, 'శాంతి కాపలాదారు'గా చిత్రించుకునే అమెరికా అసలు రంగు యుద్ధం. అమెరికాకు ఆయుధమే ఆహారం, యుద్ధమే పెట్టుబడి. ఆ దేశపు ఆర్థిక వ్యవస్థ చమురుతో కాదు, ఇతర దేశాల్లో చిందే రక్తంపై, ఆయుధాల అమ్మకాలపై ఆధారపడి నడుస్తోంది. శాంతిమంత్రం పైకి జపిస్తూనే, లోపల యుద్ధతంత్రాన్ని నడిపే అమెరికా వైఖరి మానవజాతికే ఒక కళంకం.'అమెరికా ఆయుధాలు తింటోంది' అనేది నేడు ఒక చేదు నిజం. అంటే.. అది కేవలం లోహపు ముక్కలను మింగడం కాదు; కోట్లాదిమంది అమాయకుల కలలను, పసిపిల్లల భవిష్యత్‌ను, స్వతంత్ర దేశాల సార్వభౌమత్వాన్ని పచ్చిగా నమిలి మింగుతోందని అర్థం. అమెరికాకు శాంతి అంటే ఒక నినాదం మాత్రమే. కానీ యుద్ధం అంటే ఒక భారీ లాభదాయకమైన వ్యాపారం.ప్రపంచ దేశాల మధ్య చిచ్చు పెట్టడం, ఆ మంటల్లో తన ఆయుధాల ఫ్యాక్టరీలను వేడి చేసుకోవడం ఆ దేశానికి వెన్నతో పెట్టిన విద్య. ఒక దేశంపై బాంబులు కురిపించాలన్నా, మరో దేశపు సార్వభౌమత్వాన్ని కాలరాయాలన్నా అమెరికాకు కావాల్సింది 'ప్రజాస్వామ్య రక్షణ' అనే ఒక అబద్ధపు సాకు. ఆ దేశపు క్షిపణులపై రాసి ఉండేది శాంతి సందేశం కాదు, రాబోయే వినాశనం తాలూకు ధర. ప్రపంచంలో ఎక్కడ యుద్ధం జరిగినా, అది అమెరికా స్టాక్ మార్కెట్‌కు పండగే. శ్మశానాల మీద సౌధాలు నిర్మించుకునే వికృత ఆర్థిక వ్యవస్థ అమెరికాది.

డాలర్ విలువ పెరగాలంటే మరో దేశం రణరంగం కావాల్సిందే. మధ్య ప్రాచ్యం నుంచి ఐరోపా వరకు అమెరికా వేసిన ప్రతి అడుగు వెనుక చమురు వేట, ఆయుధాల అమ్మకం తప్ప మానవత్వం ఎక్కడా కనిపించదు. మందుగుండు సామాగ్రిని అమ్మడం కోసం శత్రువులను సృష్టించడం, ఆపై మధ్యవర్తిగా నటిస్తూ ఇరుపక్షాల రక్తాన్ని పీల్చడం – ఇదే వాషింగ్టన్ అనుసరిస్తున్న అసలైన 'వ్యూహాత్మక భాగస్వామ్యం'.అమెరికా ఆర్థిక వ్యవస్థకు యుద్ధం అనేది ఒక 'లైఫ్ సపోర్ట్' లాంటిది; అది ఆగిపోతే ఆ దేశపు జిడిపి వెంటిలేటర్ మీదకు వెళ్తుంది. లాక్ హీడ్ మార్టిన్, బోయింగ్, రేథియాన్ వంటి సంస్థల షేర్లు పెరగాలంటే, మరో దేశంలో పసిపిల్లల హాహాకారాలు వినిపించాలి. శత్రువు లేకపోతే అమెరికా మనుగడ లేదు. అందుకే ఒకవేళ ప్రపంచంలో శత్రువు లేకపోతే, తన ఆయుధాలు అమ్ముకోవడం కోసం ఒక కొత్త శత్రువును తానే సృష్టించి, అతడిని ప్రపంచానికి విలన్‌గా పరిచయం చేస్తుంది. అమెరికా నేరుగా యుద్ధ రంగంలోకి దిగదు, కానీ యుద్ధం ఆగిపోనివ్వదు. దీనినే ఆ దేశం 'ప్రాక్సీ వార్' అని పిలుచుకుంటుంది. రష్యాను దెబ్బకొట్టడానికి ఉక్రెయిన్‌ను ఒక పావుగా వాడుకుంటూ, వేలకోట్ల విలువైన ఆయుధాలను సరఫరా చేస్తోంది. దీనివల్ల ఉక్రెయిన్ నాశనమవుతున్నా, అమెరికా ఆయుధ కంపెనీల లాభాలు మాత్రం ఆకాశాన్ని తాకుతున్నాయి. అమెరికా తన యుద్ధోన్మాదంతో ప్రపంచదేశాలపై రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక, సాయుధ, సాంకేతిక అణచివేతలకు పాల్పడుతుంది.సుమారు 800 బిలియన్ డాలర్లకు పైగా రక్షణ బడ్జెట్‌తో అమెరికా ప్రపంచంలోనే అతిపెద్ద సైనికశక్తిగా ఉంది. ఇది మిగతా టాప్ 10 దేశాల బడ్జెట్ కంటే ఎక్కువ. ప్రపంచ ఆయుధ ఎగుమతుల్లో సుమారు 40% వాటా అమెరికాదే. అభివృద్ధి చెందుతున్న దేశాలు సొంతంగా రక్షణ రంగంలో ఎదగకుండా ఆంక్షలు విధిస్తూ, ప్రపంచ దేశాలన్నీ సాంకేతికత కోసం తనపైనే ఆధారపడేలా చేసుకుంటుంది.

ఒకసారి అమెరికా ఆయుధాన్ని కొంటే, ఆ దేశం ఇక దశాబ్దాల పాటు అమెరికాకు బానిసగా ఉండాల్సిందే. ఇది రక్షణ ఒప్పందం కాదు, ఒక దేశంపై రుద్దే 'డిజిటల్, మిలిటరీ బానిసత్వం'. ప్రపంచ శాంతిని కాపాడాల్సిన ఐక్యరాజ్యసమితి, నేడు అమెరికా చేతిలో ఒక కీలుబొమ్మగా మారిపోయింది. తన ప్రయోజనాలకు భంగం కలిగించే ఏ తీర్మానాన్ని అయినా అమెరికా తన 'వీటో' అధికారంతో తొక్కిపెడుతుంది. అణ్వాయుధ రాజకీయంలో అమెరికాది అందెవేసిన చెయ్యి. 'తుపాకీ గొట్టంద్వారా వచ్చే శాంతి శ్మశాన శాంతి మాత్రమే. అది ఎప్పటికీ శాశ్వతం కాదు. 'దీన్ని అగ్రరాజ్యాలైన అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, రష్యా, చైనా తోపాటు ప్రపంచ దేశాలన్నీ గుర్తుంచుకోవాలి. శాంతి అనేది బాంబుల మోత ఆగినప్పుడు వచ్చే నిశ్శబ్దం కాదు.. అది ప్రతి మనిషి భయం లేకుండా బతికే స్వేచ్ఛ. అధికారం కంటే మానవత్వం, ఆయుధాల కంటే సహజీవనం గొప్పవని ప్రపంచ దేశాలు గుర్తించి, అమెరికా సృష్టిస్తున్న ఆయుధ విషవలయం నుండి, 'సాంకేతిక బానిసత్వం' నుండి బయటపడినప్పుడే భూమిపై నిజమైన శాంతి వెల్లివిరుస్తుంది. ఆయుధాలు లేని ప్రపంచమే రేపటి తరానికి మనం ఇచ్చే అతిపెద్ద ఆస్తి!

# బ్లాక్‌ప్లాస్టిక్ పెట్టెల్లో ఫుడ్ ప్యాక్ చేస్తున్నారా.?



రెస్టారెంట్లు, హోటల్లు, ఇతర ప్రదేశాలలో నల్ల ప్లాస్టిక్ కంటైనర్ల వాడకంపై భారతీయ జనతా పార్టీ రాజ్యసభ ఎంపీ ఘనశ్యామ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. నల్ల ప్లాస్టిక్ డబ్బాల్లోని ఆహారాన్ని మళ్లీ వేడి చేయడం సురక్షితమేనా? మార్చి 25, 2026న రాజ్యసభలో ప్రజా ప్రయోజన విషయాలపై తీవ్ర చర్చ జరిగింది. రెస్టారెంట్లు, హోటల్లు, ఇతర ప్రదేశాలలో నల్ల ప్లాస్టిక్ కంటైనర్ల వాడకంపై భారతీయ జనతా పార్టీ రాజ్యసభ ఎంపీ ఘనశ్యామ్ తివారీ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కంటైనర్లు సాధారణ ప్లాస్టిక్ కాదని, వాటిని రీసైకిల్ చేసిన ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాల నుండి తయారు చేస్తారని ఆయన పేర్కొన్నారు. వాటిలో వేడి ఆహారాన్ని నిల్వ ఉంచితే, మైక్రోప్లాస్టిక్ కణాలు ఆహారంలోకి చేరవచ్చని ఘనశ్యామ్ తివారీ తెలిపారు. దీనిపై నిపుణులు ఏమంటున్నారో ఇప్పుడు తెలుసుకుందాం. నివేదికల ప్రకారం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, పారిశ్రామిక ప్లాస్టిక్‌ను నిల్వ చేయడానికి నల్ల ప్లాస్టిక్‌ను తరచుగా ఉపయోగిస్తారు. దీనిని అగ్ని నిరోధకంగా చేయడానికి, డెకాబిడిఇ వంటి మంటలను ఆర్పే రసాయనాలను కలుపుతారు. సమస్య ఏమిటంటే, ఈ రసాయనాలు ప్లాస్టిక్‌కు పూర్తిగా అంటుకోవు. వేడి చేసినప్పుడు, ముఖ్యంగా ఆహారం వేడిగా , నూనెగా ఉన్నప్పుడు, అవి ఆహారంలోకి స్రవించగలవు. అంతేకాకుండా, ఈ ప్లాస్టిక్‌లో బిపిఎ, థాలేట్స్ వంటి రసాయనాలు కూడా ఉంటాయి. ఇవి హార్మోన్ల పనితీరును దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. మీరు అటువంటి పాత్రలలో ఆహారాన్ని వేడి చేసినప్పుడు లేదా వాటిని పదేపదే ఉపయోగించినప్పుడు, ఈ రసాయనాలు క్రమంగా శరీరంలో పేరుకుపోయి దీర్ఘకాలిక హానిని కలిగిస్తాయంటున్నారు వైద్యులు హెచ్చరిస్తున్నారు. 2024లో జరిగిన ఒక అధ్యయనం 200కు పైగా నల్ల ప్లాస్టిక్ ఉత్పత్తులను విశ్లేషించి, వాటిలో దాదాపు 85 శాతం ఉత్పత్తులలో విషపూరితమైన ఫ్లేమ్ రిటార్డెంట్లు ఉన్నట్లు కనుగొంది. ఈ రసాయనాలకు దీర్ఘకాలం పాటు గురికావడం వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం పెరుగుతుందని వైద్యులు పేర్కొంటున్నారు. ఃఖం, థాలేట్స్ వంటి మూలకాలు హార్మోన్ల అసమతుల్యతకు కారణం కావడమే కాకుండా, గుండె జబ్బులు, మధుమేహం, పునరుత్పత్తి సంబంధిత సమస్యల ప్రమాదాన్ని కూడా పెంచుతాయని వివరిస్తున్నారు. అంతేకాకుండా, నల్ల ప్లాస్టిక్ నుండి విడుదలయ్యే మైక్రోప్లాస్టిక్‌లు కూడా శరీరంలోకి ప్రవేశించి విషభారాన్ని పెంచుతాయని, ఇది దీర్ఘకాలంలో వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని వైద్య నిపుణులు అంటున్నారు. ముఖ్యంగా పిల్లలు, గర్భిణీ స్త్రీలు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉన్నవారిపై దీని ప్రభావాలు మరింత తీవ్రంగా ఉండవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. క్యాన్సర్‌తో దీనికి ప్రత్యక్ష సంబంధం ఉందని నిశ్చయంగా నిరూపించనప్పటికీ, ఇందులోని రసాయనాల పట్ల జాగ్రత్తగా ఉండటం ముఖ్యం. నల్ల ప్లాస్టిక్ పాత్రలకు బదులుగా గాజు, స్టీలు, చెక్క పాత్రలను ఉపయోగించాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. ప్లాస్టిక్‌ను, ముఖ్యంగా ఆహారాన్ని వేడి చేయడానికి, వాడకపోవడమే అత్యంత సురక్షితమైన పద్ధతి అంటున్నారు.

# ఎండాకాలం ఓ గ్లాసు తాగితే కూల్ కూల్..



వేడి వాతావరణంలో అలసట, డీహైడ్రేషన్ సమస్యలతో పాటు జీర్ణ సమస్యలు ఎదుర్కొంటున్న వారికి బార్లీ నీరు ఒక సులభమైన, ప్రభావవంతమైన సహజ పరిష్కారం.. ఈ పురాతన ఆయుర్వేద పానీయం శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడమే కాకుండా, అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఆధునిక జీవనశైలిలో ఎదురయ్యే డీహైడ్రేషన్, జీర్ణ సమస్యలు, అనేక ఇతర ఆరోగ్య సవాళ్లకు బార్లీ నీరు ఒక పురాతన, సహజసిద్ధమైన, ప్రభావవంతమైన పరిష్కారం. ఆయుర్వేదంలో దీనికి ప్రత్యేక స్థానం ఉంది. ఇది శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచడమే కాకుండా, సమగ్ర ఆరోగ్యాన్ని పెంపొందించే అనేక ప్రయోజనాలను అందిస్తుంది. వాస్తవానికి బార్లీ నీరు ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో (మెగ్నీషియం, మాంగనీస్, సెలీనియం, ఐరన్) నిండిన అద్భుతమైన ఆరోగ్య పానీయం.. ఇది మూత్రపిండాల ఆరోగ్యం, బరువు తగ్గడం, షుగర్ నియంత్రణ.. శరీరాన్ని డీటాక్స్‌ఫై చేయడంలో సహాయపడుతుంది.

బార్లీ నీరు ఆరోగ్య ప్రయోజనాలు:జీర్ణక్రియ మెరుగుపడుతుంది: బార్లీ నీటిలో అధికంగా ఉండే డైటరీ ఫైబర్ ఆరోగ్యకరమైన గట్ మైక్రోబయోమ్‌ను ప్రోత్సహిస్తుంది, ప్రేగు కదలికలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది గ్లూకోజ్ శోషణను నెమ్మదిస్తుంది.. తద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. మధుమేహులు లేదా రక్తంలో చక్కెర నియంత్రణకు ప్రయత్నిస్తున్న వారికి ఇది చాలా ప్రయోజనకరమైనది. కొలెస్ట్రాల్ నియంత్రణ: బార్లీ నీరు శరీరం నుండి బైల్ యాసిడ్‌ను తొలగించడం ద్వారా కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. కాలేయం కొత్త బైల్ యాసిడ్‌ను తయారుచేయడానికి ఎక్కువ కొలెస్ట్రాల్‌ను ఉపయోగించేలా చేయడం ద్వారా మొత్తం కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. మూత్రనాళ ఆరోగ్యం: ఇది సహజమైన మూత్రవిసర్జనకారిగా పనిచేస్తుంది.. మూత్ర ఉత్పత్తిని పెంచుతుంది. మూత్ర నాళాల నుండి విష పదార్థాలు, బ్యాక్టీరియాను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ డిటాక్సిఫికేషన్ ప్రక్రియ కాలేయానికి కూడా మేలు చేస్తుంది. ఎలక్ట్రోలైట్ సమతుల్యత: పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం వంటి ముఖ్యమైన ఖనిజాలు బార్లీ నీటిలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరంలో ద్రవ సమతుల్యత, కండరాల పనితీరుకు చాలా అవసరం. వేడి వాతావరణం, శారీరక శ్రమ లేదా వ్యాయామం వల్ల కోల్పోయే ఎలక్ట్రోలైట్లను భర్తీ చేయడంలో ఇది సహాయపడుతుంది. ఆయుర్వేదం ప్రకారం, బార్లీ నీరు వాత, పిత్త, కఫ అనే త్రిదోషాలను సమతుల్యం చేయగలదు. బార్లీ నీరు మీ రోజువారీ ఆహారంలో చేర్చుకోవడానికి సులభమైన, పోషకాలతో నిండిన పానీయం. ఇది డీహైడ్రేషన్ నుండి జీర్ణక్రియ వరకు, కొలెస్ట్రాల్ నియంత్రణ నుండి ఎలక్ట్రోలైట్ సమతుల్యత వరకు అనేక ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు.

# పొద్దునే వేడి నీళ్లు తాగితే అద్భుతాలు జరుగుతాయా?



ఖరీదైన మందులు, సప్లిమెంట్స్ కంటే ప్రకృతి సిద్ధమైన ఇటువంటి చిన్న మార్పులు మన ఆరోగ్యంపై పెద్ద ప్రభావం చూపుతాయి. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్‌లో లక్షలాది వ్యూస్ సంపాదిస్తున్న ఈ వీడియోలలో ప్రజలు ఉదయాన్నే వేడి నీళ్లు తాగడం, వేడి అల్పాహారం తీసుకోవడం మరియు చిన్నపాటి వ్యాయామాలు చేయడం కనిపిస్తుంది. దీనిని 'న్యూలీ చైనీస్' అని కూడా పిలుస్తున్నారు. నేటి కాలంలో సోషల్ మీడియా ప్రభావం ఎంతగా ఉందంటే, వేల ఏళ్ల నాటి సంప్రదాయాలు కూడా సరికొత్త 'ట్రెండ్స్' రూపంలో మన ముందుకు వస్తున్నాయి. 21 ఏళ్ల మరియమ్ ఖాన్ లాంటి ఎంతోమంది యువత ఇప్పుడు ఖరీదైన స్కిన్ కేర్ ప్రోడక్ట్స్ లేదా కఠినమైన వర్కవుట్స్ జోలికి వెళ్లకుండా.. ఒక చిన్న అలవాటును పాటిస్తున్నారు. అదే 'ఉదయాన్నే వేడి నీళ్లు తాగడం'. చైనా సంప్రదాయ వైద్యం మరియు మన ఆయుర్వేదంలో ఎప్పటి నుంచో ఉన్న ఈ విధానం, ఇప్పుడు టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్స్‌లో 'చైనా మ్యాక్సింగ్' పేరుతో వైరల్ అవుతోంది. వేల సంవత్సరాలుగా చైనీస్ మెడిసిన్, మన భారతీయ ఆయుర్వేద వైద్య విధానాల్లో వేడి నీటికి గొప్ప ప్రాధాన్యత ఉంది. ఉదయాన్నే వేడి నీరు తాగడం వల్ల శరీరంలోని జీర్ణవ్యవస్థ యాక్టివేట్ అవుతుంది. ఇది ఆహారం త్వరగా జీర్ణం కావడానికి, మలబద్ధకం వంటి సమస్యలను నివారించడానికి సహాయపడుతుంది. వేడి నీరు శరీర ఉష్ణోగ్రతను స్వల్పంగా పెంచుతుంది, దీనివల్ల చెమట పట్టి శరీరంలోని టాక్సిన్లు బయటకు పోతాయి. గోరువెచ్చని నీరు తాగడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి, శరీరమంతటా రక్త ప్రసరణ మెరుగ్గా జరుగుతుంది. ఇది కండరాల నొప్పులను కూడా తగ్గిస్తుంది. ప్రస్తుతం యువత ఈ పాత పద్ధతులకు ఆధునిక మెరుగులు దిద్దుతోంది. కేవలం నీళ్లే కాకుండా, వేడి వేడి అల్పాహారం తీసుకోవడం వల్ల శరీరానికి అవసరమైన శక్తి లభిస్తుందని వారు నమ్ముతున్నారు. ఈ వీడియోలు చూసి ఆధునిక యువత తమ జీవనశైలిని మార్చుకుంటున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది కేవలం మారుతున్న ఫ్యాషన్ కాదు. చల్లటి నీటి కంటే గోరువెచ్చని నీరు శరీరానికి ఎక్కువ మేలు చేస్తుందని సైన్స్ కూడా అంగీకరిస్తోంది. ముఖ్యంగా ఉదయాన్నే ఖాళీ కడుపుతో దీనిని తీసుకోవడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చు. అయితే, నీరు మరీ ఎక్కువగా మరిగించినది కాకుండా, గొంతుకు హాయిగా ఉండేలా 'గోరువెచ్చగా' ఉండటం ముఖ్యం. మరి మీరు కూడా రేపటి నుండి ఈ 'హాట్ వాటర్ ఛాలెంజ్' మొదలుపెడతారా?

# 92 ఏళ్ల క్రితం ముత్తాత..92 ఏళ్ల తర్వాత మునిమనవడు!





భారతీయ సినీ చరిత్రలో కపూర్ ఖాందాన్ వారసత్వం గురించి ఎంత చెప్పినా తక్కువే. తాజాగా ఓ అరుదైన కాకతా ళీయం చోటు చేసుకుంది. ఇప్పుడీ కాకతాళీయం బాలీవుడ్ తో పాటు అభిమానుల్లోనూ హాట్ టాపిక్ గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. సరిగ్గా 92 ఏళ్ల క్రితం రణబీర్ కపూర్ ముత్తాత భారతీయ సినిమా పితామహులలో ఒకరైన పృథ్వీరాజ్ కపూర్ పోషించిన అదే పవిత్రమైన శ్రీరాముడి పాత్రను ఇప్పుడు 92 ఏళ్ల తర్వాత ఆయన మునిమనవడు రణబీర్ కపూర్ పోషిస్తుండటం. ఈ చారిత్రాత్మక ప్రయాణం 1934లో ప్రారంభమైంది. అప్పట్లో ప్రఖ్యాత దర్శకుడు దేబకీ బోస్ దర్శకత్వంలో -సీత- అనే సినిమా తెరకెక్కింది. ఆ చిత్రంలో పృథ్వీరాజ్ కపూర్ శ్రీరాముడిగా నటించి మెప్పించారు. ఆ కాలంలోనే ఈ సినిమా అంతర్జాతీయ వేదికలపై భారతీయ సినిమా సత్తాను చాటింది. వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్ వంటి ప్రతిష్టాత్మక వేదికపై ప్రదర్శించబడిన తొలి భారతీయ శబ్ద చిత్రం ఇదే కావడం విశేషం. అప్పట్లో పృథ్వీరాజ్ కపూర్ తన నటనతో రాముడి పాత్రకు ఒక ప్రత్యేక హుందాతనాన్ని తీసుకొచ్చారు. తాజాగా తొమ్మిది దశాబ్దాల అనంతరం అదే కుటుంబం నుండి వచ్చిన నాలుగో తరం నటుడు రణబీర్ కపూర్ నితీష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న -రామాయణం- చిత్రంలో శ్రీరాముడిగా నటిస్తున్నారు. ముత్తాత వేసిన బాటలో మునిమనవడు నడవడం అనేది అవకాశం మాత్రమే కాదు. అదొక గొప్ప బాధ్యత. రాముడి పాత్ర కోసం రణబీర్ కపూర్ ఎంతో శ్రమిస్తున్నాడు. తన ఆహార్యం నుండి మాట్లాడే తీరు వరకు ప్రతి అంశంలోనూ శ్రీరాముడి ఉదాత్తత ప్రతిబింబించేలా ప్రత్యేక శిక్షణ తీసుకుని రంగంలోకి దిగాడు. ఆధునిక సాంకేతికత , భారీ బడ్జెట్తో రూపొం దుతున్న చిత్రమిది. ఇందులో పృథ్వీరాజ్ కపూర్ కాలం నాటి ఆత్మీయతను, నేటి తరం విజువల్ వండర్‌ను కలిపి ప్రేక్షకులకు అందించే అవకాశం ఉంది. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు దిగ్గజ నటులు ఒకే పాత్రను రెండు వేర్వేరు శతాబ్దాలలో పోషించడం అనేది భారతీయ సినిమా చరిత్రలోనే అరుదైన రికార్డు. అప్పటి -సీత- పాత్రలో దుర్గా ఖోటే సీతగా నటించి రికార్డు సృష్టించగా. ఇప్పటి -రామాయణం-లో సీత పాత్రలో దక్షిణాది నటి సాయి పల్లవి నటిస్తుంది. దీంతో అదే స్థాయి మ్యాజిక్‌ను నేటి సీత రిపీట్ చేస్తుందని మేకర్స్ ఆశిస్తున్నారు. నితీష్ తివారీ తెరకెక్కిస్తోన్న -రామాయణం- రెండు భాగాలు గా ప్రేక్షకుల ముందుకు రానుంది. మొదటి భాగాన్ని ఇదే ఏడాది రిలీజ్ చేయనున్నారు. అనంతరం రెండవ భాగం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తారు.

# అఖిల్ ని మారుతి లైన్ లో పెడుతున్నాడా?







అక్కినేని వారసుడు అఖిల్ సక్సెస్ కోసం ఎలా ఎదురు చూస్తున్నాడో? చెప్పాల్సిన పనిలేదు. ఎన్నో ఆశలు పెట్టుకున్న -ఏజెంట్- ఫలితం ఊహించని విధంగా రావడంతో? మరోసారి ఫ్లాప్ రూపంలో గట్టి ఎదురు దెబ్బ తగిలింది. -మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్ లర్- తో వచ్చిన సక్సెస్ ను -ఏజెంట్- తోనూ కొనసాగించాలని చూసిన ఆలోచనకు బ్రేక్ పడింది. -ఏజెంట్- హిట్ అయితే కెరీర్ కొత్త టర్నింగ్ తీసుకుంటుందని ఎంతో ఆశించాడు కానీ ఫలితం తీవ్ర నిరాశనే మిగిల్చింది. దీంతో కొత్త కథలు, దర్శకుల విషయంలో ఆచితూచి అడుగులు వేస్తున్నాడు.

ప్రస్తుతం మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వంలో -లెనిన్- లో నటిస్తోన్న సంగతి తెలిసిందే. రాయలసీమ బ్యాక్ డ్రాప్ లో తెరకెక్కుతోన్న చిత్రమిది. ఇప్పటికే చిత్రీకరణ ముగింపు దశకే చేరుకుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూడా జరుగు తున్నాయి. సమ్మర్ కానుకగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. అయితే అగ్ర హీరోల చిత్రాలు రిలీజ్ కు ఉండ టంతో వెనక్కి తగ్గుతున్నాడు. మరి తదుపరి చిత్రాల సంగతేంటి? అంటే ఓ ఇంట్రెస్టింగ్ విషయం లీకైంది. అఖిల్ కోసం మారుతి ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే అఖిల్ తో రెండు..మూడు మీటింగ్లు కూడా జరిగాయని సన్నిహిత వర్గాల నుంచి తెలిసింది.

మరి ఈ కాంబో సెట్ అవుతుందా? లేదా? అన్నది ఇంకా చర్చల దశలో ఉంది కాబట్టి క్లారిటీ రావడానికి సమయం పడతుంది. మారుతి చివరిగా ప్రభాస్ తో తెరకెక్కించిన -ది రాజాసాబ్- ఫ్లాప్ అయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి మారుతి హీరోల విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తర్వాత ఏ హీరోతో సినిమా చేసిన అది పక్కా హిట్ అవ్వాలనే కసితో పని చేస్తున్నాడు. ఇప్పటికే మారుతి అక్కినేని కాంపౌండ్ లో నాగచైతన్య హీరోగా -శైలిజ రెడ్డి అల్లుడు- అనే సినిమా తెరకెక్కించిన సంగతి తెలిసిందే. ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చింది. కానీ కమర్శియల్ గా మంచి లాభాలే తెచ్చి పెట్టింది. ఆ పాజిటివ్ సైన్ అఖిల్ సినిమా పరంగా కలిసొచ్చే అవకాశం ఉంది.ద అఖిల్ కూడా కొత్త దర్శకుల్ని ఎంచుకోవడంలో విఫలమవుతున్నాడు. ఇంత వరకూ అతడు చేసిన ప్రయత్నాల్లో ఒకటి రెండు తప్ప పెద్దగా కలిసి రాలేదు. ఈ క్రమంలో మారుతి లాంటి అనుభవం ఉన్న దర్శకుడితో సినిమా చేస్తే అఖిల్ కి ప్లస్ అవుతుందనే భావన ఉంది.ఇంకా అఖిల్ వేర్వేరు దర్శకులతోనూ టచ్ లో ఉన్నాడు. వాళ్లందరిలో ఎవరి మంచి కథతో ముందుకొస్తే వాళ్లతోనే ముందుకెళ్తాడు. మరి మారుతి విషయంలో ఎలాంటి ప్రకటన వస్తుందో చూడాలి.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com